ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన చర్చిలు

యేసు క్రీస్తును శిలువ వేసిన రోజును గుడ్ ఫ్రైడేగా వ్యవహరిస్తారు. క్రైస్తవులకు ఈ రోజు ఎంతో పవిత్రమైన రోజు. ఉపవాస దీక్షలతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల గురించి ప్రత్యేకంగా చర్చిలలో ప్రసంగిస్తారు. ప్రతి మాట వెనుక ఎంత లోతైన అర్థం ఉందో వివరిస్తారు.

- నేడు గుడ్ ఫ్రైడే
- క్రైస్తవులకు 'శుభ శుక్రవారం'


నగరి ఎస్‌పిఎల్‌సీ చర్చిలో శిలువయాత్ర ఘట్టాన్ని ప్రదర్శించిన క్రైస్తవులు

విజయపురం: మండలవ్యాప్తంగా అన్ని చర్చిలు గుడ్ ఫ్రైడే ప్రత్యేక ఆరాధనలకు సిద్ధమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఉపవాస దీక్షలతో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు. కల్వరి గిరి మీద యేసుక్రీస్తు మరణాన్ని గుర్తు చేసుకుంటూ మానవాళి పాప విమోచనార్థం ఆయన శిలువ వేయబడ్డారనేది బైబిల్ చెబుతోంది. మనుషులను పాపాల నుంచి విముక్తి కల్పించడం కోసం శిలువపై ప్రాణత్యాగం చేసిన దైవ కుమారుడని, అందుకే శుభ శుక్రవారంగా క్రైస్తవులు ప్రార్థనలు చేస్తారు. ముఖ్యంగా యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల గురించి ప్రత్యేకంగా వాక్య సందేశమిస్తారు. యేసుక్రీస్తు శిలువ వేయబడిన సమయం మధ్యాహ్నం 3 గంటలకు చర్చి గంటలు మోగించి, సంతాప సూచకంగా మౌనం కొన్ని క్షణాలు మౌనం వహిస్తారు. ప్రార్థనల మజ్జిగ, నిమ్మరసం మొదలైన వాటిని స్వీకరించి ఉపవాస దీక్షలు విరమిస్తారు.

ఆకట్టుకున్న శిలువ యాత్ర

రోమన్ సైనికులు యేసుక్రీస్తుని బంధించడం, శిలువ భారం మోపి తీసుకెళ్లడం..ఘటనను గుర్తు చేసుకుంటూ విధంగా పలు చర్చిలలో పాస్టర్లు శిలువ యాత్రను పలు చర్చిలలో నిర్వహించారు.

శిలువ మరణం పొందిన రోజు



సమస్త మానవాళి పాప విమోచనార్థం యేసుక్రీస్తు శిలువపై ప్రాణాలు అర్పించిన దినాన్ని గుడ్ ఫ్రైడే అంటారు. బైబిల్ ప్రకారం యేసుక్రీస్తు శుక్రవారం శిలువ వేయబడ్డారు. అందుకే శుభ శుక్రవారం లేదా గుడ్ ఫ్రైడే అని అంటారు. ఆ రోజున క్రైస్తవులు ఉపవాసం ఉంటారు. యేసుక్రీస్తు శిలువపై పలికిన మాటలను ప్రత్యేకంగా ధ్యానిస్తారు. –పాస్టర్ చంద్రశేఖర్, లూథరన్ చర్చి, వేపగుంట

క్లుప్తంగా

మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ


లతమ్మను రష్ ఆస్పత్రిలో పరామర్శిస్తున్న నారాయణస్వామి

కార్వేటినగరం: వైఎస్సార్‌సీపీ నేత ఆశీర్వాదం సతీమణి లతమ్మకు శస్త్ర చికిత్స చేసినట్లు సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులే అన్నారు. ప్రతి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని ప్రజలు ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మోహన మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎస్సీ కులానికి చెందిన 21 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు గల వారు అర్హులని తెలిపారు. మే 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసుల చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రంలో నీటిని విద్యార్థులకు ఇస్తున్న డీఎస్పీ

నగరి: వేసవిలో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట చలివేంద్రాన్ని డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఎండాకాలం పూర్తయ్యేంతవరకు చలివేంద్రాన్ని కొనసాగించాలని, ప్రతి రోజూ శుభ్రమైన నీటిని ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ఉత్తమ ఫలితాలు


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఐరాల: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు ఆకాంక్షించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించిన కళాశాల విద్యార్థులను ఆయన అధ్యాపకులతో కలిసి అభినందించి మాట్లాడారు. తమ కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సరం ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వంద శాతం, ప్రథమ, ద్వితీయ బైపీసీ గ్రూపులో వంద శాతం, ఆర్ట్స్ గ్రూపులో 90 శాతం, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో మురహరి 946 మార్కులు సాధించాడని, ప్రైవేటు కళాశాలలకు దీటుగా తమ కాలేజీ ఫలితాలు సాధించడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఎంపీసీ విద్యార్థులకు ఐఐటీ మద్రాసు నిపుణులతో ఆన్‌లైన్ క్లాసులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు కాలేజీలలో కాకుండా ప్రభుత్వ కాలేజీలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన చీరాలమ్మ జాతర

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : చీరాలమ్మ జాతర మహోత్సవాలు గురువారం గ్రామోత్సవంతో ముగిశాయి. రేణిగుంట మండలం కృష్ణాపురం సమీపంలోని తిప్పపై వెలసిన చీరాలమ్మ జాతర సందర్భంగా గురువారం తెల్లవారుజామున సంప్రదాయం ప్రకారం కృష్ణాపురం సర్పంచ్ కుమార ముద్దు రాయలు ఇంటి నుంచి అమ్మవారి గెరిగా, పసుపు కుంకుమ, సారే, పొంగళ్లను ఊరేగింపుగా గుట్టపైకి తీసుకెళ్లి అమ్మవారికి తొలిపూజ చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. అనంతరం అమ్మవారి పసుపు, కుంకుమను తీసుకొచ్చి కృష్ణాపురం పాతూరు, కొత్తూరు గ్రామాల్లో గంగమ్మ రాయి వద్ద అమ్మవారి ప్రతి రూపాన్ని తీర్చిదిద్ది గంగమ్మ జాతరను జరుపుకున్నారు. సాయంత్రం గ్రామాలలో అమ్మవారి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

వైభవంగా కుంభాభిషేకం

విజయపురం: మండలంలో పన్నూరులోని శ్రీ ఆనందవల్లీదేవి సమేత ఇష్టకామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జీర్ణోద్ధరణ, అష్ట బంధన మహా కుంభాభిషేకం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి వారిని ప్రత్యేకంగా అలకరించారు. శాస్త్రోక్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది, పచ్చని తోరణం వేశారు. పుర వీధుల్లో విద్యుద్దీపాలతో అమ్మవారి ప్రతిరూపాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



హోమం చేస్తున్న అర్చకులు, (ఇన్‌సెట్) విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన స్వామివారి కటౌట్

ఇసుక టిప్పర్ సీజ్


సీజ్ చేసిన ఇసుక టిప్పర్

విజయపురం: తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఎస్‌ఐ రంగా సీజ్ చేసి తహసీల్దార్ కిరణ్‌కు అప్పగించారు. ఎస్‌ఐ తన సిబ్బందితో పన్నూర్ సబ్‌స్టేషన్ పరిధిలో తనిఖీ చేశారు. స్వామి రెడ్డి కండ్రిగ వద్ద ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్ తరలించారు. అనంతరం తహసీల్దార్ కిరణ్ జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


కమలశ్రీని సత్కరిస్తున్న ప్రిన్సిపల్ రఘుపతి

పుత్తూరు: ఇంటర్ సీఎస్‌ఈ గ్రూపులో టాపర్‌గా నిలిచిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం.కమలశ్రీ, ఆమె తల్లిదండ్రులు మదనాచ్చారి, భువనేశ్వరిని గురువారం కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సన్మానించింది. ప్రిన్సిపల్ ఎ.రఘుపతి మాట్లాడుతూ 1000/987 మార్కులు సాధించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం పుత్తూరు కళాశాలకు గర్వకారణమన్నారు. కమలశ్రీని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థిని చదువుల్లో రాణించాలన్నారు. అనంతరం కమలశ్రీకి అధ్యాపక బృందం నగదు బహుమతిని అందజేసి సత్కరించింది. కార్యక్రమంలో వివిధ గ్రూపుల్లో ప్రతిభ కనబరచిన ఇతర విద్యార్థినులనూ సత్కరించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

శ్రీకాళహస్తి: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్, ఆయిల్ , ఎలక్ట్రికల్ ఫైర్ అయిన సందర్భంగా ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలో ప్రదర్శించి చూపించారు. అదే విధంగా పై అంతస్థులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు, పొగ దట్టంగా అలుముకున్న సమయంలో ఎలా కాపాడాలో అవగాహన కల్పించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ రామకృష్ణాపురం ఒంటిళ్లలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక సర్పంచ్ గోవిందయ్య కొత్త మోటారును అమర్చి నీటి సమస్యను పరిష్కరించారు.

వాట్సాప్ గవర్నెన్స్‌లో పౌరసేవలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ పురుషోత్తం

వెదురుకుప్పం: వాట్సాప్ గవర్నెన్స్‌లో పౌర సేవలను అందిస్తున్నట్లు ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. గురువారం వెదురుకుప్పంలో సచివాలయ సిబ్బందికి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మనమిత్ర పేరిట వాట్సాప్ ద్వారా అనేక రకాల సేవలను పొందే అవకాశం ఉందన్నారు. వాట్సాప్ ద్వారా సందేశాన్ని పంపితే ఇంటి నుంచే 224కి పైగా సేవలను పొందవచ్చన్నారు. ప్రతిఒక్కరూ విధిగా మనమిత్ర ఫోన్ 95523 00009ను సేవ్ చేసుకోవాలన్నారు.

ఆశీస్సులు


వధూవరులతో మాజీ మంత్రి రోజా

పుత్తూరు: స్థానికంగా ఓ కల్యాణ మండపంలో గురువారం వడమాలపేట మండలం ఓటీఆర్ కండ్రిగ పంచాయతీ సర్పంచ్ శ్రీవిద్య కుమార్తె యశస్విని, జ్యోతి ప్రకాష్ వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. నవ వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

రాగి పంట సాగు లాభదాయకం

పెనుమూరు (కార్వేటినగరం): రాగిపంట సాగు లాభదాయకమని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అట్లవారిపల్లిలో చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలలో అత్యధిక పోషక విలువలు కలిగిన రాగి , కొర్ర, సజ్జ వంటి పంటలు పండించే విధానంపై అవగాహన కల్పించారు. రాగి పంట సాగు చేసినప్పుడు ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుందని పేర్కొన్నారు. రాగి సాగుకు ఖర్చు తక్కువగానే ఉంటుందని చెప్పారు. ఒక ఎకరం వరి సాగుకు ఉపయోగించే నీటితో రాగి పంటను 5 ఎకరాల వరకు సాగు చేయవచ్చన్నారు. రాగి పంటకు తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెనుమూరు వ్యవసాయాధికారి శ్రీనివాస్, హార్టికల్చర్ అసిస్టెంట్ తులసి, సర్పంచ్ వెంకటేష్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాలు దూరం


ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

నగరి: అప్రమత్తతతో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని స్థానిక అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం శ్రీనివాస ఆస్పత్రిలో సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాలు తలెత్తితే వాటిని ఎలా ఆర్పాలి? సురక్షితంగా ఎలా బైటపడాలో ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ, విపత్తులను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక వాహనం సిద్ధంగా ఉందన్నారు. అగ్నిప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉంటే ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా చూసుకోవచ్చన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే తమకు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రతాప్, ప్రవీణ్‌కుమార్, మోహన్, సత్య, ప్రకాష్, రామచంద్రయ్య, కోటేశ్వరరావు, మధు, లోకయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

21న విజయవాడలో ధర్నా జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు

చిత్తూరు కార్పొరేషన్: అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని టీడీపీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షురాలు లలిత, ప్రధాన కార్యదర్శి షకీల మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, పలు యాప్స్‌ను రద్దు చేసి ఒకే యాప్ పెట్టాలని డిమాండ్ చేశారు. పనిభారం తగ్గించి అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. హామీలు ఇచ్చిన వాటికి జీవోలు విడుదల చేయాలన్నారు. అలాగే జిల్లాలో 12 ప్రాజెక్టులలో స్థానికంగా వివిధ రకాల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కారం కోసం దశలవారీ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కొన్నిచోట్ల రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని, వాటికి స్వస్తి పలకాలన్నారు. స్థానిక సమస్యలను జిల్లా ప్రాజెక్టు అధికారి సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రమీల, మమత, విజయ, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన


పుత్తూరు ఆర్టీసీ డిపో వద్ద ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

పుత్తూరు: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆర్టీసీ ఉద్యోగులు స్థానిక డిపో ముందుకు ప్లకార్డుల పట్టుకుని ఆందోళన చేశారు. ఆందోళనకు నేతృత్వం వహించిన పుత్తూరు డిపో ఎన్‌ఎంయూ అధ్యక్షుడు సుందరం మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌ఎంయూ కార్మికులు పోరాటం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం న్యాయమైన సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని, ఉద్యోగ భద్రతా సర్క్యులర్-2019ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులకు స్వస్తి పలకాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను ఇవ్వాలని, మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ సెలవులను మంజూరు చేయాలని, గ్యారేజీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థాగత వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలు కేటాయించాలని, పారదర్శక బదిలీలు చేయాలని, ప్రభుత్వం సమస్యలపై స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎం.శివకుమార్, గ్యారేజ్ అధ్యక్షుడు రమేష్, యూనియన్ నాయకులు దొరబాబు, ఆర్ముగం, సెల్వం, రాయులు, చంద్రశేఖర్, నాగరాజు, నందకుమార్, వాసు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం


విజయపురం: మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణవేణి


కార్వేటినగరం: ముస్లిం కాలనీలో పోషణ కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నగరి/విజయపురం: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకునేలా చూడాలని, తద్వారా రక్తహీనత సమస్య బారిన పడకుండా ఉంటారని సీడీపీఓ కృష్ణవేణి అన్నారు. గురువారం నగరి మండలంలోని దామరపాకం, విజయపురం మండలంలోని పన్నూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ పథకంలో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చాలా మంది గర్భిణులు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారని, దీనివల్ల శిశువులు ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వలేరని, కొన్ని సందర్భాల్లో అనారోగ్యంతో చనిపోతున్నట్టు చెప్పారు. దీనిని అధిగమించేందుకు పోషణ్ అభియాన్ పేరుతో వెయ్యి రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. పిల్లలకు పోషకాహారంతో పాటు పరిశుభ్రత పాటించాలన్నారు.పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు గర్భిణులు, బాలింతలు ఏ సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలనే అంశాలపై వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు శంకరమ్మ, లక్ష్మి, సర్పంచ్ షణ్ముగరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులు

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యంగా మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈఓ గిరిజ ఆదేశించారు. గురువారం చలమరాజు ఇండ్లు ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో త్వరగా అప్‌లోడ్ చేయాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం రాజ , సీఆర్పీ రాజేశ్వరి, మనిరాజ్ ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కార్వేటినగరం: చిరుధాన్యాలతో కూడిన ఆహారం బాలింతలకు ఎంతో అవసరమని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఇందిరా అన్నారు. గురువారం కార్వేటినగరం ముస్లిం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పోషక విలువలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షామిని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

పాలసముద్రం: బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ వినితాశ్రీ తెలిపారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో సూపర్‌వైజర్ అనురాధ, ఏపీఎం కల్పలతారెడ్డి ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కౌమార దశలో బాలికలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

అలరించిన దుర్యోధన వధ


దుర్యోధన వధ ఘట్టానికి హాజరైన జనం

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు గ్రామంలో మహాభారతయజ్ఞంలో భాగంగా గురువారం జరిగిన దుర్యోధన వధ అలరించింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై అక్కడ జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయనకు గ్రామ పెద్దలతోపాటు రూరల్ మండల నేతలు స్వాగతం తెలిపారు. మండల కన్వీనర్‌బాలాజీ నాయుడు, సర్పంచ్ మునస్వామి, పాల్గొన్నారు.